# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

బుధవారం 30 ఏప్రిల్ 2025 పేజీలు 8


# అవి పట్టా భూములే

**భూదాన్ భూములంటూ.. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయండి**

**హైకోర్టులో ఐపీఎస్‌ల అప్పీళ్లు.. నేడు విచారణ**



**హైదరాబాద్ పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని సర్వే నంబర్ 194లో తాము కొనుగోలు చేసిన భూములు భూదాన్‌వి కాదని, పట్టా భూములేనంటూ పలువురు ఐపీఎస్‌లు హైకోర్టుకు నివేదించారు. ఈ సర్వే నంబరులో 16, 20, 18 గుంటల విస్తీర్ణాలతో కొనుగోలు చేశామన్నారు. దీనికి సంబంధించిన విక్రయ ఒప్పందపత్రాలు కూడా ఉన్నాయని తెలిపారు. నాగారం గ్రామంలో సర్వే నం.181, 182, 194, 195లలో భూదాన్ భూములకు సంబంధించి పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్‌లతో సహా ఉన్నతాధికారుల పాత్రపై ఆరోపణల నేపథ్యంలో ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చాలంటూ సింగిల్ జడ్జి ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను పలువురు అధికారులు తాజాగా సవాల్ చేశారు. ఈ మేరకు ఐపీఎస్‌లు రవిగుప్తా, తరుణ్‌జోషి, బి.కె.రాహుల్ హెగ్డే, జితేందర్ కుమార్ గోయల్ భార్య రేణుగోయల్,

-2 లో

# కరెంటు ఛార్జీల పెంపు లేదు

- టారిఫ్ ఉత్తర్వు జారీచేసిన ఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ నాగార్జున్
- ఆర్థికలోటు రూ.20,151 కోట్లు ఉంటుందని డిస్కంల పిటిషన్
- విచారణ జరిపి రూ.13,499 కోట్లుగా నిర్ధారణ
- ఆ మొత్తాన్ని రాయితీగా ఇస్తామన్న ప్రభుత్వం

-2 లో



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో కరెంటు ఛార్జీల పెంపు లేదని, పాత పద్ధతిలోనే యథాతథంగా వసూలు చేయాలని డిస్కంలను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) ఆదేశించింది. ఈమేరకు కరెంటు ఛార్జీల టారిఫ్ ఉత్తర్వును మంగళవారం మండలి కార్యాలయంలో ఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ డి.నాగార్జున్ విడుదల చేశారు. ఈ ఉత్తర్వు గురువారం (మే 1) నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించారు. రాష్ట్రంలోని రెండు డిస్కంలు, రాజన్న సిరిసిల్లలోని సెస్‌తో కలిపి మొత్తం మూడు విద్యుత్ సంస్థల ఆర్థికలోటు రూ.13,499.41 కోట్లు ఉంటుందని ఈఆర్‌సీ తేల్చింది. ఈ ఏడాది ఆర్థికలోటు రూ.20,151 కోట్లు ఉంటుందని గత నవంబరులో డిస్కంలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరపగా.. అంతకు రూ.6,652 కోట్లు తక్కువగా రూ.13,499.41 కోట్లు ఉంటుందని వెల్లడైనట్లు ఛైర్మన్ తెలిపారు.

-2 లో

## రికార్డు స్థాయి ఎండలు...

# జగిత్యాలలో 44.4 డిగ్రీలు నమోదు

- తెలంగాణలో రోజురోజుకు పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలో అత్యధికంగా 44.4°C నమోదు
- నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లోనూ అధిక ఉష్ణోగ్రతలు
- రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో తీవ్రమైన ఎండల ప్రభావం



**హైదరాబాద్ పెన్ పవర్:** జగిత్యాల జిల్లాలోని ఇబ్రహీంపట్నంలో రాష్ట్రం లోనే అత్యధికంగా 44.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో ఇదే అత్యధిక ఉష్ణోగ్రతగా పరిగణిస్తున్నారు. జగిత్యాల జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ లోని పలు జిల్లాల్లోనూ తీవ్రమైన ఎండలు ఉన్నాయి. నిర్మల్

-2 లో

# నేడు 'స్విచ్ఛాఫ్ లైట్స్'కు పిలుపునిచ్చిన అసదుద్దీన్ ఒవైసీ

- వక్ఫ్ సవరణ చట్టంను వ్యతిరేకిస్తూ నిరసన
- రాత్రి తొమ్మిది గంటలకు 15 నిమిషాల పాటు లైట్లు ఆఫ్ చేయాలని పిలుపు
- వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఏఐఎంపీఎల్‌బీ నిరసన కార్యక్రమాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** వక్ఫ్ సవరణ చట్టం-2025ని నిరసిస్తూ ఈ నెల 30వ తేదీన దేశవ్యాప్తంగా 'లైట్స్ ఆఫ్'కు మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పిలుపునిచ్చారు. ఆ రోజున రాత్రి తొమ్మిది గంటలకు లైట్లను స్విచ్ఛాఫ్ చేయాలని సూచించారు.

**ఏఐఎంపీఎల్‌బీ నిరసన కార్యక్రమాలు**

వక్ఫ్ సవరణ చట్టం-2025ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ)

-2 లో

# కరెంటు ఛార్జీల పెంపు లేదు

- మొదటి పేజీ తరువాయి

వ్యవసాయ కరెంటు వినియోగం ఎక్కువగా ఉంటుందని భావించి డిస్కంలు ఎక్కువ లోటు చూపాయని, కానీ అంత ఉండదని ఈఆర్సీ విచారణలో నిర్ధారించినట్లు వివరించారు. మొత్తం ఆర్థికలోటు తీర్చడానికి రూ.13,499.41 కోట్లను రాయితీగా విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం రాతపూర్వకంగా తెలిపినందున ఛార్జీల పెంపునకు అనుమతించడం లేదని జస్టిస్ నాగార్జున్ వివరించారు.

**ఉత్తర్వులోని ముఖ్యాంశాలు...**

గృహ వినియోగ కరెంటు ఛార్జీల్లో రాయితీలకు రూ.1,896.81 కోట్లు, వ్యవసాయానికి ఉచితంగా ఇస్తున్నందుకు మరో రూ.11,602.60 కోట్లు ఇస్తామని ప్రభుత్వం వివరించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇచ్చిన రాయితీ సొమ్ముకన్నా ఇది 1999.89 కోట్లు (17.4%) అధికం.

గృహజ్యోతి పథకంలో 50,52,167 ఇళ్లకు నెలకు 200 యూనిట్ల వరకు ఇస్తున్న ఉచిత కరెంటు కోసం ఈ ఏడాది ప్రభుత్వం రూ.1,922 కోట్లను చెల్లించనుంది.

విద్యుత్ వాహనాల(ఈవీ) ఛార్జింగ్ స్టేషన్ కాంట్రాక్టులోడు పరిమితి ఇంతకాలం 56 కిలోవాట్లు ఉండగా దానిని 150 కిలోవాట్లకు పెంచడానికి ఈఆర్సీ అనుమతించింది.

గ్రిడ్ సపోర్టు రుసుం ప్రస్తుతం నెలకు కిలోవాట్‌కు రూ.18.48 ఉండగా.. మే 1 నుంచి రూ.20.04కి పెంచడానికి అనుమతించింది.

ఓపెన్ యాక్సెస్ వినియోగదారులు 24 గంటల ముందు నోటీసు ఇవ్వకుండా... కాంట్రాక్టు డిమాండుకన్నా అదనంగా కరెంటు వాడుకుంటే 10% అదనంగా ఛార్జీలను వసూలుచేస్తారు.

**కరెంటు ప్రమాదాలపై అవగాహన పెరగాలి**

కరెంటు ప్రమాదాల్లో ముఖ్యంగా యువత ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రజలకు అవగాహన కల్పించాలని డిస్కంలకు సూచించినట్లు జస్టిస్ నాగార్జున్ చెప్పారు. యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నిర్మాణం 2026 జనవరి నాటికి పూర్తవుతుందని, అప్పటివరకూ పూర్తిగా 4 వేల మెగావాట్ల కరెంటు రాదని, దానిని పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. పగటిపూట సౌరవిద్యుత్ ఉత్పత్తి ఎక్కువగా ఉంటున్నందున, రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉన్నట్లు కనిపిస్తోందని, కానీ రాత్రిపూట థర్మల్ విద్యుత్ ఎక్కువగా అవసరమని.. డిస్కంలు బయట కొనాల్సి వస్తుందని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే 2030 నాటికి రాష్ట్రంలో కరెంటు కొరత ఏర్పడుతుందన్నారు. దాన్ని అధిగమించడానికి కొత్త విద్యుత్కేంద్రాలతో కొనుగోలు ఒప్పందాలు చేసుకోవాలన్నారు.

# అవి పట్టా భూములే

- మొదటి పేజీ తరువాయి

ఐఏఎస్ జనార్దన్‌రెడ్డి కుమారుడు రాహుల్ బుసిరెడ్డి, ఐపీఎస్‌లు మహేశ్ భగవత్, సౌమ్య మిశ్ర, స్వాతి లక్రా, ఉమేశ్ షరాఫ్ భార్య రేఖ షరాఫ్‌లతోపాటు ప్రైవేటు వ్యక్తి వీరన్నగారి గౌతంరెడ్డి హైకోర్టులో వేర్వేరుగా 4 అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై సీజే ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టనుంది.

**'భూదాన్ జాబితాలో 194 సర్వే నంబరు లేదు'**

నాగారం గ్రామంలోని భూదాన్ భూముల్లో అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులకు ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో సీబీఐ, ఈడీలతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ మహేశ్వరం మండలానికి చెందిన బిర్ల మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో ప్రతివాదులైన ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, పలువురు ప్రైవేటు వ్యక్తులకు నోటీసులు జారీ చేయడంతోపాటు సర్వే నం.181, 182, 194, 195లోని భూములను నిషేధిత జాబితాలో చేర్చాలంటూ సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. తమతోపాటు భూమి యజమానులకు నోటీసులు జారీ చేసి వివరణ తీసుకోకుండానే సింగిల్ జడ్జి ఏకపక్షంగా ఉత్తర్వులు జారీ చేశారంటూ అప్పీలుదారులు పేర్కొన్నారు. తాను అధికారులకు సమర్పించిన వినతిపత్రాలపై దర్యాప్తునకు సంబంధించి నివేదికలు తెప్పించేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషనర్ అభ్యర్థించారని, అయితే దీనికి మించి ఉపశమనం కలిగిస్తూ సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. 194, 195 సర్వే నంబర్లలో 30 ఎకరాలుండగా, అందులోని భూములను కొనుగోలు చేశామన్నారు. భూదాన్ భూములను ప్రైవేటు భూములుగా మార్చారన్న ఆరోపణలు అవాస్తవమన్నారు. 2023 నవంబరులో తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు జారీ చేసిన ప్రొసీడింగ్స్‌లో.. సర్వే నం.181లోని 50 ఎకరాలను భూదాన్ భూమిగా పేర్కొందన్నారు. బోర్డు పేర్కొన్న జాబితాలో సర్వే నం.194 లేదన్నారు. 2019 ఫిబ్రవరిలో సర్వే నం.194, 195ల్లోని (సర్వే నం.195/2లో 95.25 ఎకరాలు మినహా) భూములను పట్టా భూములుగా పేర్కొంటూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్స్ జారీ చేశారన్నారు. పిటిషనర్ ఈ ప్రొసీడింగ్స్‌కు సంబంధించిన పత్రాలను సింగిల్ జడ్జికి సమర్పించలేదన్నారు. ఈ భూమికి సంబంధించి పిటిషనర్ మల్లేశ్ తల్లి కూడా కొన్ని విక్రయ ఒప్పందాలు చేశారని పేర్కొన్నారు.

**'భూదాన్' కేసులో.. కార్లు, నగదు స్వాధీనం**

మహేశ్వరం మండలం నాగారం గ్రామ పరిధిలో ప్రభుత్వ రికార్డులను తారుమారు చేసి భూదాన్ భూములు కొల్లగొట్టిన కేసులో పెద్దఎత్తున సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మంగళవారం వెల్లడించింది. భూదాన్ భూములు ప్రైవేటు వ్యక్తులకు అమ్మిన ఉదంతానికి సంబంధించి మహేశ్వరం పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఇందులో నిధుల మళ్లింపు కోణంలో ఈడీ ఇంకో కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా నిందితులు ఖదీరున్నీసా, మహ్మద్ మునావర్‌ఖాన్, మహ్మద్ లతీఫ్ షర్ఫాన్, మహ్మద్ అక్తర్ షర్ఫాన్, మహ్మద్ షుకూర్ తదితరుల ఇళ్లలో సోమవారం సోదాలు నిర్వహించింది. ఈ సందర్భంగా మునావర్‌ఖాన్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రంలో పెద్దమొత్తంలో ప్రభుత్వ భూముల అమ్మకాలు, కొనుగోళ్లకు చెందిన తప్పుడు ధ్రువపత్రాలు, రూ.23 లక్షల నగదు, 12వేల యూఏఈ దిర్హామ్స్, అనేక వింటేజ్ కార్లతో సహా పాతవి, కొత్తవి కలిపి 45 కార్లు స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ ప్రకటనలో పేర్కొంది. భూదాన్ భూములను ఖదీరున్నీసా అనే మహిళ తమ వారసత్వ ఆస్తిగా పేర్కొనడంతోపాటు కొంతమంది మధ్యవర్తులతో కలిసి రికార్డులను తారుమారు చేసి ప్రైవేటు వ్యక్తులకు అమ్మినట్లు ఈడీ గుర్తించిన సంగతి తెలిసిందే.

## నేడు 'స్విచ్ఛాఫ్ లైట్స్'కు పిలుపునిచ్చిన అసదుద్దీన్ ఒవైసీ

- మొదటి పేజీ తరువాయి

దేశవ్యాప్త ఆందోళనలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఏప్రిల్ 30న 'లైట్స్ ఆఫ్' పేరుతో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఆ రోజు రాత్రి 9 గంటలకు దేశవ్యాప్తంగా ప్రజలు తమ ఇళ్లు, వాణిజ్య సముదాయాల్లో 15 నిమిషాల పాటు లైట్లను స్విచ్ ఆఫ్ చేసి, ఈ చట్టంపై తమ వ్యతిరేకతను శాంతియుతంగా తెలియజేయాలని బోర్డు కోరింది.

ఇటీవల హైదరాబాద్‌లో మజ్లిస్ సహకారంతో 'వక్ఫ్‌ను రక్షించండి, రాజ్యాంగాన్ని కాపాడండి' పేరిట నిర్వహించిన భారీ బహిరంగ సభ విజయవంతం కావడంతో, ఆందోళనను మరింత ఉధృతం చేయాలని ఏఐఎంపీఎల్‌బీ నిర్ణయించింది. ఆ సభకు వేలాది మంది ప్రజలతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్, వైసీపీ, డీఎంకే సహా పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.

'వక్ఫ్ రక్షణ' పేరిట చేపట్టిన ఈ ప్రచార కార్యక్రమం జూలై 13న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభతో ముగియనుంది. ఈ లోగా, కొత్త చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి, దానిని రద్దు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పలు కార్యక్రమాలను నిర్వహించాలని ఏఐఎంపీఎల్‌బీ ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రచార కార్యక్రమాలను ఎలా నిర్వహించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై బోర్డు తమ రాష్ట్ర, జిల్లా విభాగాలకు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. అన్ని కార్యక్రమాలు క్రమశిక్షణతో, అహింసాయుతంగా జరగాలని నొక్కి చెప్పింది.

"బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో, ప్రచారానికి సహకారం లభించే అవకాశం ఉండదని, కాబట్టి వీధి ప్రదర్శనలు లేదా బహిరంగ నిరసనలు నిర్వహించకూడదని నిర్ణయించుకున్నాం" అని ఏఐఎంపీఎల్‌బీ అధికార ప్రతినిధి సయ్యద్ ఖాసిం రసూల్ ఇలియాస్ తెలిపారు.

## రికార్డు స్థాయి ఎండలు... జగిత్యాలలో 44.4 డిగ్రీలు నమోదు

- మొదటి పేజీ తరువాయి

జిల్లాలోని దస్తురాబాద్‌లో 44.3 డిగ్రీల సెల్సియస్, నిజామాబాద్ జిల్లాలోని మెండోరాలో 44.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు వీలైనంత వరకు ఎండలో తిరగకపోవడమే మంచిదని సూచించింది. వృద్ధులు, చిన్నపిల్లలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉన్నందున మరింత అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న వేళల్లో బయటకు రావద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. రానున్న రోజుల్లోనూ ఇదే స్థాయిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

# పాకిస్తాన్ మాజీ ఎంపీ.. ఇండియాలో రోడ్లపై ఐస్ క్రీంలు అమ్ముతున్నాడు: ఇతని హిస్టరీ తెలిస్తే షాక్ అవుతారు..!

**హైదరాబాద్ పెన్ పవర్:**జమ్మూకాశ్మీర్ పహల్గాంలో ఉగ్రదాడి.. ఇండియా, పాకిస్తాన్ మధ్య తెగతెంపుల తర్వాత.. అనేక ఆసక్తికర విషయాలు బయటపడుతున్నాయి. ఇండియాలోని పాకిస్తానీయులు అందరూ వెళ్లిపోవాలనే ఆదేశాలు.. ఓ కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. ఆ విషయం తెలిసి ఇప్పుడు దేశం ఔరా అని ముక్కున వేలేసుకుంటోంది.. పాకిస్తాన్ దేశ పార్లమెంట్ కు ఎంపీగా ఎన్నికైన ఓ వ్యక్తి.. ఇప్పుడు ఇండియాలో రోడ్లపై.. సైకిల్ పై తిరుగుతూ ఐస్ క్రీంలు అమ్ముకుంటున్నాడు. ఇతని ఫ్యామిలీలో ఏకంగా మొత్తం 34 మంది ఉన్నారు.. వీళ్లల్లో ఆరుగురికి ఇండియా పౌరసత్వం కూడా ఉంది. ఈ ఇప్పుడు మీడియాకు రావటంతో అందరూ షాక్ అవుతున్నారు. పాకిస్తాన్ ఎంపీ ఏంటీ.. ఇండియాలో రోడ్లపై ఐస్ క్రీం అమ్ముకోవటం ఏంటీ అని.. ఈ పూర్తి వివరాలు తెలుసుకుందాం.. అతని పేరు దబయ్ రాం. అతని వయస్సు 75 ఏళ్లు.. 1988లో బదయ్ రాం పాకిస్తాన్ దేశంలోని బఖర్ జిల్లా నుంచి ఎంపీగా అక్కడి పార్లమెంట్?కు ఎన్నికయ్యాడు. అవును.. మీరు విన్నది నిజమే.. అంత పెద్ద హోదాలో ఉన్న బదయ్ రాం జీవితం ఆ తర్వాత తలకిందులు అయ్యింది.

పహల్గాం టెర్రర్ ఎటాక్ తర్వాత యావత్ దేశ ప్రజలు దాయాది పాకిస్థాన్?పై భగ్గుమంటున్నారు. పహల్గాం ఉగ్రదాడి వెనక పాక్ హస్తం ఉందని గుర్తించిన భారత ప్రభుత్వం పాక్?పై చాలా సీరియస్?గా ఉంది. ఈ క్రమంలోనే దాయాది దేశానికి తగినబుద్ధి చెప్పాలని భారత్ కౌంటర్ యాక్షన్ మొదలుపెట్టింది. ఈ మేరకు పాకిస్థాన్?తో సింధు నది జలాల ఒప్పందాన్ని రద్దు



చేసుకుని పాక్?ను కోలుకోలేని దెబ్బకొట్టింది. దీంతో పాటు పాక్ పౌరులకు మంజూరు చేసిన అన్నీ వీసాలను రద్దు చేసి.. 2025, ఏప్రిల్ 28లోపు దేశం విడిచివెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేసింది.

దీంతో 537 మంది తిరిగి పాక్?కు వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ఓ ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. పాక్ మాజీ ఎంపీ దబాయ్ రామ్ 36 మంది కుటుంబ సభ్యులతో కలిసి ఇంకా హర్యానాలోనే ఉన్నారు. ఇందులో ఆరుగురికి భారత పౌరసత్వం లభించింది. మిగిలిన 28 మంది ఇండియా విడిచి వెళ్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. దబాయ్ రామ్ వ్యవహారంలో భారత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

**ఎవరీ దబాయ్ రామ్..?**

పాకిస్తాన్‌లోని పంజాబ్‌లో విభజనకు రెండు సంవత్సరాల ముందు దబాయ రామ్ జన్మించారు. 1947 తర్వాత భారత్ నుంచి పాక్ విడిచిపోయినప్పటికీ ఆయన పాకిస్థాన్?లోనే స్థిరపడ్డారు. 1988లో రామ్ లోహియా, బఖర్ జిల్లాల నుంచి ఆయన పాకిస్తాన్ జాతీయ అసెంబ్లీకి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే.. పాక్?లో దబాయ ఫ్యామిలీకి మతపరమైన సమస్యలు ఎదురయ్యాయి. మత తీవ్రవాదులు ఏకంగా దబాయ్ రామ్ కుటుంబంలోని ఓ మహిళను బలవంతంగా వివాహం చేసుకున్నారు. దీనిపై ఆయన పాక్ సుప్రీంకోర్టుకు వెళ్లగా ఆయనకు నిరాశ ఎదురైంది. దీంతో తీవ్ర అసంతృప్తికి లోనైన 2000 సంవత్సరంలో ఒక నెల వీసాపై కుటుంబంతో కలిసి ఇండియాకు వచ్చారు. హర్యానాలోని రోహ్‌తక్‌కు రతన్‌గఢ్‌లో స్థిరపడ్డారు. అప్పటి నుంచి వీసా గడువును పొడగించుకుంటూ.. సైకిల్ రిక్షా ఐస్ క్రీంలు కుటుంబాన్ని పోషించుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన భారత వీసాకు కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. దబాయ రామ్ ఫ్యామిలీలో మొత్తం 36 మంది ఉండగా.. ఇందులో ఆయనతో పాటు మరో ఐదుగురికి భారత పౌరసత్వం లభించింది. మిగిలిన 28 మంది సిటిజన్?షిప్ అప్లికేషన్లు పెండింగ్?లోనే ఉన్నాయి. ఇంతలోనే జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో ఉగ్రవాదులు నరమేధం సృష్టించడంతో దాయాది దేశంపై కన్నెర్రజేసిన భారత ప్రభుత్వం.. పాకిస్తానీయుల వీసాలు రద్దు చేసి వెంటనే దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. దీంతో దబాయ రామ్ ఫ్యామిలీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆరుగురికి మాత్రమే భారత పౌరసత్వం ఉండటంతో.. మిగిలిన 28 మంది పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. మత వివక్ష కారణంగా పాక్ విడిచి వచ్చిన ఆయన కుటుంబంతో కలిసి దాదాపు 25 ఏండ్లుగా భారత్?లోనే ఉంటున్నారు. ప్రస్తుతం హర్యానాలోని ఫతేహాబాద్ జిల్లాలో నివసిస్తున్న దబాయా రామ్ కుటుంబాన్ని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో స్థానిక పోలీసులు విచారించారు. అనంతరం వారిని తిరిగి ఇంటికి తిరిగి పంపించారు. దీంతో దబాయ్ రామ్ కుటుంబ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఆసక్తి నెలకొంది. 36 మందిని భారత్ నుంచి బహిష్కరిస్తారా..? లేక ఇక్కడ ఉండేందుకు అనుమతి ఇస్తారా..? అన్నది వేచి చూడాలి.

# జిప్‌లైన్ ఆపరేటర్ సంకేతం ఇచ్చాడా?..

- **అల్లాహూ అక్బర్ అని మూడు సార్లు చెప్పాకే కాల్పులు స్టార్ట్**
- **ఐదారుగురిని కాల్చి చంపడం చూశాను**
- **20 సెకన్ల తర్వాత ఉగ్రదాడిని అని తెలిసింది**
- **ప్రత్యక్ష సాక్షి రిషబ్ భట్ వీడియో వైరల్**



**హైదరాబాద్ పెన్ పవర్:**శ్రీనగర్: పహెల్గాం ఉగ్రదాడి దేశం మొత్తాన్ని కుదిపేస్తోంది. ఇదే క్రమంలో ఓ పర్యాటకుడు తీసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఆ వ్యక్తి తనను తాను జిప్‌లైన్ చేసుకుంటున్నట్లు, జిప్‌లైన్ ఆపరేటర్ 'అల్లాహు అక్బర్' అని మూడుసార్లు చెబుతున్నట్లు ఇందులో కనిపిస్తోంది. తాను జిప్ లైన్ లో ఉన్నప్పుడు ఉగ్రవాదుల కాల్పులను చూసి తన కుటుంబం తృటిలో ఎలా తప్పించుకున్నాడో వివరించాడు. రిషి భట్ అనే పర్యాటకుడు జిప్ లైన్ వేయడం ప్రారంభించగానే, ఆపరేటర్ అతన్ని విడుదల చేసే ముందు "అల్లాహు అక్బర్" అని మూడుసార్లు జపిస్తాడు. భట్ నవ్వుతూ రైడ్‌ను ఆస్వాదిస్తున్నట్లు చూడవచ్చు. అదే సమయంలో తుపాకీ గుండు లాంటి శబ్దం వినబడుతుంది, నేలపై ఉన్న పర్యాటకులు చెల్లాచెదురుగా పడటం చూడవచ్చు. భట్ ఏమి జరుగుతుందో గ్రహించి భయపడటం ప్రారంభించడంతో వీడియో ముగుస్తుంది.

"వారు అక్కడ ఉన్నప్పుడు, ఈ వ్యక్తి 'అల్లాహు అక్బర్' అని అనలేదు. కానీ నేను జిప్‌లైన్‌లో ఉన్నప్పుడు, అతను దానిని మూడుసార్లు అన్నాడు, ఆపై కాల్పులు ప్రారంభమయ్యాయి.

" ఈ ఘటనపై రిషి భట్ ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. 'నేను జిప్ లైన్ చేస్తున్నప్పుడు కాల్పులు ప్రారంభమయ్యాయి. దాదాపు 20 సెకన్ల పాటు నాకు ఇది అర్థం కాలేదు. ఐదారుగురిని కాల్చి చంపడం నేను చూశాను" మా ముందున్న రెండు కుటుంబాలలోని పురుషులను వారి మతం ఏమిటని అడిగి నా భార్య, కొడుకు ముందు కాల్చి చంపారు. అప్పుడు నా భార్య, కొడుకు అరుస్తున్నారు. నేను నా బెల్ట్‌ను విప్పి కిందకు దూకి, నా భార్య , కొడుకును తీసుకొని పారిపోయి ఒక గొయ్యి లాంటి ప్రదేశంలో దాక్కున్నాము." అని తెలిపారు.

## పాకిస్థాన్ జిందాబాద్ అన్నాడు... అక్కడిక్కటే కొట్టి చంపారు!

హైదరాబాద్ పెన్ పవర్:పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ అంటే ప్రజలు ఎలా మండిపడుతున్నారో చెప్పే ఘటన కర్ణాటకలోని మంగళూరులో చోటుచేసుకుంది. స్థానికంగా జరిగిన ఓ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా 'పాకిస్తాన్ జిందాబాద్' అంటూ నినాదాలు చేశాడన్న కారణంతో ఓ వ్యక్తిపై కొందరు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ దారుణ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ప్రధాన నిందితుడితో సహా పది మందికి పైగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ ముమ్మరం చేశారు.మంగళూరు శివార్లలోని కుదుపు గ్రామంలో భట్ర కల్లుర్తి ఆలయం సమీపంలో ఆదివారం మధ్యాహ్నం ఈ సంఘటన జరిగింది. అక్కడ జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో మృతుడికి, సచిన్ అనే మరో వ్యక్తికి మధ్య మొదట వాగ్వాదం చోటుచేసుకుంది. అది తీవ్ర ఘర్షణగా మారి, కొందరు గుంపుగా చేరి బాధితుడిపై కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసి, కాళ్లతో తన్నారు. సాయంత్రం ఆలయ సమీపంలో బాధితుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనను కర్ణాటక హోం మంత్రి జి. పరమేశ్వర ధృవీకరించారు. క్రికెట్ మ్యాచ్‌లో 'పాకిస్తాన్ జిందాబాద్' అని అరిచినందుకు కొందరు దాడి చేశారని, బాధితుడు తర్వాత మరణించాడని ప్రాథమిక సమాచారం ఉందన్నారు. 10-12 మందిని అరెస్టు చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని ఆయన తెలిపారు. మంగళూరు పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ మాట్లాడుతూ, పోస్టుమార్టంలో తీవ్ర గాయాల వల్లే మృతి చెందినట్లు నిర్ధారణ అయిందన్నారు. వెన్నుపై పదేపదే కొట్టడం వల్ల అంతర్గత రక్తస్రావం, షాక్‌తో మరణించినట్లు నివేదిక వెల్లడించిందని తెలిపారు. ప్రధాన నిందితుడైన సచిన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఐదుగురి కంటే ఎక్కువ మంది నేరంలో పాల్గొనడంతో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద కఠిన సెక్షన్లు నమోదు చేశామని, దీని కింద జీవిత ఖైదు లేదా మరణశిక్ష పడే అవకాశం ఉందని వివరించారు. స్థానికుడి ఫిర్యాదు మేరకు 19 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, సీసీటీవీ ఫుటేజ్, మొబైల్ డేటా ఆధారంగా పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

## విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి.

హైదరాబాద్ పెన్ పవర్:మే 1నుండి పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరం 2025 ను సద్వినియోగం చేసుకోవాలని కమాన్ పూర్ ఎంఈఓ ఇల్లందుల విజయ్ కుమార్ మంగళవారం కోరారు


పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశానుసరం పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరం 2025 ను మే 1నుండి జూన్ 10 వరకు నిర్వహించనున్నారు, దీని కోసం వాలంటరీస్ లను ఆ పాఠశాల పరిధిలోని గ్రామములో డిగ్రీ చదువు కున్న అభ్యర్థుల ను ఎంపిక చేసుకొని వారికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమాన్ పూర్ లో మంగళవారం నాడు కమాన్ పూర్ మండల విద్యాధికారి ఇల్లందుల విజయ్ కుమార్ అధ్యక్షతన శిక్షణను ఇచ్చారు,.ఈ శిక్షణ లో కమాన్ పూర్ మరియు రామగిరి మండలాల వాలంటరీలు పాల్గొన్నారు, సుమారు 30 మంది వాలంటరీలకు జిల్లా రిసోర్స్ పర్సన్లు నల్ల రవి, జి దేవేందర్ రెడ్డి ఒక రోజు శిక్షణను అందించారు,ఈ శిక్షణ కార్యక్రమం లో ఎం ఈ ఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల లోని సామర్థ్యలను,లేర్నింగ్ గ్యాప్స్ లేకుండా ఈ వేసవి శిక్షణ శిబిరం ఉపయోగపడుతుందని అన్నారు.రోజు ఉదయం 8గంటల నుండి 10:30 వరకు వాలంటరీలు ఆటలు, డ్రాయింగ్, తెలుగు, ఇంగ్లీష్, లెక్కలు బోధిస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలోరామగిరి మండల విద్యాధికారి కొమురయ్య,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు టి. శోభన్ రావు మరియు క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ ప్రభాకర్, మమత హకీమ్ లు పాల్గొన్నారు.

# ఇక యుద్ధమేనా : ప్రధాని మోదీతో.. ఆర్మీ అధికారులు అందరూ భేటీ




హైదరాబాద్ పెన్ పవర్:దేశం మొత్తం ఉత్కంఠ..భారత్ పాక్ మధ్య ఉద్రిక్తత నేపథ్యంలో ప్రధానిమోదీ త్రివిధ దళాల అధిపతులతో భేటీ ఆసక్తికరంగా మారింది. భారత్ సైన్యాధికారులతో ప్రధాని మోదీ సమావేశం యుద్ధానికి సిద్ధమవుతున్నట్లు సంకేతాలు వస్తున్నాయి. మరోవైపు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా పారామిలిటరీ దళాలతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. 2025, ఏప్రిల్ 29వ తేదీ సాయంత్రం 5 గంటల 45 నిమిషాలు..ఢిల్లీలోని ప్రధాని మోదీ నివాసంలో భారత రక్షణశాఖకు చెందిన అత్యున్నత స్థాయి అధికారులు అందరూ భేటీ అయ్యారు. జమ్మూకాశ్మీర్ పహల్గాంలోని ఉగ్రదాడికి ప్రతీకార చర్యలపై చాలా చాలా సీరియస్ గా డిస్కషన్ చేశారు. ప్రధాని మోదీతోపాటు రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, త్రివిధ దళాలకు చెందిన ఉన్నతాధికారులు..ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ కు చెందిన జనరల్స్.. జాతీయ భద్రతా అధికారి అజిత్ దోవల్ కూడా ఈ సమావేశంలో పాల్గొనటం ఆసక్తిగా మారింది. అంతకుముందు కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో పారామిలిటరీ దళాల హైలెవెల్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో %దీూఖీ, జూ+%, అసోం రైఫిల్స్ అధికారులు పాల్గొన్నారు. దాదాపు 40 నిమిషాల పాటు ఈ సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ పాల్గొన్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పరిణామాలపై చర్చించారు. అటు కేంద్ర హోంశాఖ, ఇటు ప్రధాని మోదీ త్రివిధ దళాల అధిపతులతో చర్చించడం యుద్ధంపై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

# ఆర్మీకోసం విరాళాలు అంటూ సోషల్ మీడియాలో పోస్టులు..తెలంగాణ పోలీస్ కీలక ప్రకటన




హైదరాబాద్ పెన్ పవర్: ఆర్మీ ఆధునీకరణకు విరాళాలు ఇవ్వాలి అంటూ సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అవుతున్నాయి. సైనిక సహాయ నిధికి డొనేషన్స్ పేరిట ఫేక్ వెబ్ సైట్లు క్రియేట్ చేశారు.వాట్సాప్ , టెలిగ్రామ్, ఫేస్ బుక్, లింక్స్ షేర్ చేస్తూ డబ్బులు అడుగుతున్నారు. ప్రజల దేశభక్తిని ఆసరాగా చేసుకొని మేసేజ్ పంపుతూ మోసాలకు పాల్పడుతున్నారు. అయితే దీనిని తెలంగాణ పోలీసు హెచ్చరికలు జారీ చేసింది. ప్రజల దేశభక్తిని ఆసరాగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు సైబర్ నేరగాళ్లు. #IndianArmy ఆధునీకరణ కోసం విరాళాల సేకరణ అంటూ SocialMedia లో పోస్టులు చేస్తున్నారు. ఇలాంటి సమాచారం మీ దృష్టికి వస్తే రిపోర్ట్ చేయండి. వాటిని ఫార్వార్డ్ చేయకండి. ఫేక్ సమాచారంపై అవగాహన కల్పించండి pic.twitter.com/TV3stcCjeh

— Telangana Police (@TelanganaCOPs) April 29, 2025

ఇండియా ఆర్మీ కోసం విరాళాలపై జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దని తెలంగాణ పోలీసులు తెలిపారు. ఇండియన్ ఆర్మీ కోసం ఎలాంటి విరాళాలు సేకరించడం లేదు..ఇలాంటి లింక్స్ కనిపిస్తే తక్షణమే రిపోర్టు చేయాలని కోరారు. ఇలాంటి ఫేక్ మేసేజ్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు అలెర్ట్ చేశారు. "ప్రజల దేశభక్తిని ఆసరాగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు సైబర్ నేరగాళ్లు. ఇండియన్ ఆర్మీ ఆధునీకరణకోసం విరాళాల సేకరణ అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఇలాంటి సమాచారం మీ దృష్టికి వస్తే రిపోర్ట్ చేయాలి. ఇలంటి మేసేజ్ లను ఫార్వార్డ్ చేయొద్దని ఫేక్ సమాచారంపై అవగాహన కల్పించాలని " తెలంగాణ పోలీస్ శాఖ %శ%లో పోస్టును షేర్ చేసింది.

## కశ్మీర్‌లో మరిన్ని ఉగ్రదాడులు జరిగే ప్రమాదం ఉంది : ఇంటెలిజెన్స్ హెచ్చరికలు జారీ

హైదరాబాద్ పెన్ పవర్: జమ్ముకశ్మీర్ లోని పహల్‌గామ్‌లో ఉగ్రవాదులు సృష్టించిన మారణకాండలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భారత భద్రతా బలగాలు ఉగ్రవాదులను అంతం చేసే పనిలో నిమగ్నమై ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇంటెలిజెన్స్ చేసిన ఓ హెచ్చరిక మరింత భయాందోళనకు గురి చేస్తోంది.పహల్‌గామ్ ఘటనను మరవక ముందే కశ్మీర్‌లో మరిన్ని ఉగ్రదాడులు జరిగే ప్రమాదం ఉందని ఇంటెలిజెన్స్ హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో 50 పర్యాటక ప్రదేశాలను జమ్ముకశ్మీర్ ప్రభుత్వం మూసివేసింది. దీంతో పబ్లిక్ మార్కులు, గార్డెన్లు ఇతర పర్యటక ప్రదేశాలు మూతబడ్డాయి. అయితే ఇవి మళ్లీ ఎప్పుడు తిరిగి తెరుచుకుంటాయనే విషయంలో స్పష్టత లేదు. ఇంటెలిజెన్స్ నుంచి హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

# పకడ్బందీగా పారదర్శకంగా భూ భారతి చట్టం అమలు

**హైదరాబాద్ పెన్ పవర్:** భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని పకడ్బందీగా పారదర్శకంగా అమలు చేస్తామని, రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేదని, గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

సైదాపూర్ మండల కేంద్రంలోని విశాల సహకార పరపతి సంఘం కళ్యాణమండపంలో, చిగురుమామిడి మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులకు మంత్రి హాజరయ్యారు.

మొదటగా సైదాపూర్ మండల కేంద్రంలో విశాల సహకార పరపతి సంఘం నూతన భవనాన్ని, కళ్యాణమంటపాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం ఇదే మండపంలో ఏర్పాటు చేసిన భూభారతి నూతన రెవెన్యూ చట్టం అవగాహన సదస్సులో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. భూమి ఒక గౌరవంగా భావించే రైతుకు ధరణి వచ్చిన తర్వాత మనశ్శాంతి లేకుండా పోయిందని అన్నారు. ధరణి తెచ్చిన భూ వివాదాల కారణంగా రైతుల ఆవేదన, ఆక్రోశం తహసీల్దార్ పై దాడి చేసే వరకు వెళ్లిందని అన్నారు. ధరణి వ్యవస్థ వల్ల రైతు తన భూమిని తాను అమ్ముకునే పరిస్థితి లేదని అన్నారు. అధికారులను గత ప్రభుత్వం దొంగలుగా చిత్రీకరించి రాత్రికి రాత్రి వందల ఎకరాల భూములను వారి పేరు పైకి బదిలాయించుకున్నారని తెలిపారు. 30 సంవత్సరాల కింద ఉన్న భూములు విక్రయించి వెళ్లిపోయిన వారి పేర్లు ధరణిలో వచ్చాయని, దీనివల్ల అసలైన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని సంకల్పంతో, భవిష్యత్తులో ఎలాంటి భూ సమస్యలు



ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం భూ భారతి నూతన రెవెన్యూ చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని తెలిపారు. జూన్ 2 నుండి ఈ చట్టం ద్వారా సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. ఈ చట్టం ద్వారా రైతులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి భూమికి భూధార్ సంఖ్య కేటాయిస్తామని తెలిపారు.

భూమికు సంబంధించిన రికార్డులన్నీ ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న రికార్డు చేయడం జరుగుతుందని వెల్లడించారు. చెప్పిన పని చేయలేదని సాకుతో విఆర్ఓ వ్యవస్థను రద్దు చేశారని, భూముల హక్కులను కాపాడేందుకు గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తామని తెలిపారు. భూ భారతి చట్టాన్ని పారదర్శకంగా, పకడ్బందీగా అమలు చేస్తామని అన్నారు. తెలంగాణలో రైతులకు చెందిన ప్రతి భూ సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. ప్రభుత్వ ఆస్తులు ప్రభుత్వ అవసరాలకు మాత్రమే వినియోగించాలని తెలిపారు. ఎవరైనా భూకబ్జాలకు పాల్పడి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, తిరిగి ఆ భూములను ప్రజా అవసరాలకు వినియోగిస్తామని అన్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, దఫదఫాలుగా పేదలందరికీ ఈ పథకం వర్తింపజేయాలని అధికారులకు సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గం లో తాగు, తాగునీటి అవసరాలు పూర్తిగా పరిష్కరిస్తామని అన్నారు. సహకార పరపతి సంఘాలు సమర్థవంతంగా పనిచేస్తూ రైతు సమస్యలను పరిష్కరించాలని ఆకాంక్షించారు.

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా అధికారాల వికేంద్రీకరణ జరిగిందని, అధికారులు బాధ్యత జవాబుదారితనం పెరిగిందని తెలిపారు. గ్రామ పరిపాలన అధికారాల వ్యవస్థ బలోపేతం కానుందని అన్నారు. సాదా బైనామాతో సాగు చేసుకుంటున్న వారికి భూభారతిలో న్యాయం జరగనుందని తెలిపారు. ధరణిలో నియమనిబంధనలు లేకపోవడంతో అధికారులకు, ప్రజలకు మధ్య వాగ్వాదాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. భూభారతి ద్వారా స్పష్టమైన నియమాలను ప్రభుత్వ రూపొందించిందని, భూ వివాదాల పరిష్కారానికి ఈ చట్టంలో అన్ని వివరాలు పొందుపరిచారని తెలిపారు. అనువంశికంగా వచ్చే భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విచారించి వివాదాలకు తావు లేకుండా వారసత్వం హక్కు కల్పిస్తారని తెలిపారు. రెండంచెల అప్పీలు వ్యవస్థ ఉండడం వల్ల రైతుకు న్యాయం జరగకపోతే ఉన్నతాధికారులను ఆశ్రయించవచ్చని తెలిపారు. కోర్టులకు వెళ్లవలసిన అవసరం ఉండదని అన్నారు. ఆరు నెలల కింద ప్రభుత్వం తహసిల్దార్, ఆర్డీవోలకు అధికారాలు ఇవ్వడం ద్వారా జిల్లాలోని 9 వేలకు పైగా భూ సమస్యల దరఖాస్తులు పరిష్కరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, సహకార సంఘం చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సుధాకర్, డీసీఓ రామానుజాచార్య, డీఏవో భాగ్యలక్ష్మి, తహసిల్దార్లు రమేష్, మంజుల, ఎంపీడీవో యాదగిరి పాల్గొన్నారు.

# సమన్వయంతో పుష్కర పనులు చేయాలి

**జయశంకర్ భూపాలపల్లి పెన్ పవర్:** సరస్వతి పుష్కరాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం విఐపి ఘాట్, సరస్వతి మాతా విగ్రహం ఏర్పాటు, టెంట్ సిటి ఏర్పాటు, పార్కింగ్ ప్రదేశాలు, జాయ్ రైడ్, సత్రం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్న ప్రదేశాలను పరిశీలించారు.

అనంతరం ఈఓ కార్యాలయంలో పనులు పర్యవేక్షణ ప్రత్యేక అధికారులు, రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, ఇరిగేషన్, విద్యుత్, ఆర్ డబ్ల్యుఎస్, పీఆర్, రవాణా, వైద్య తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఐపి ఘాట్ వద్ద టెంట్ సిటీ, ఎగ్జిబిషన్, ఫుడ్ కోర్టు, స్టాళ్లు, కిడ్స్ జోన్ తదితర ఏర్పాటు చేయుటకు మార్కింగ్ చేయాలని తహసీల్దార్ ను ఆదేశించారు. విఐపి ఘాట్ వెళ్ళు రహదారి నిర్మాణానికి మార్కింగ్ చేయాలన్నారు. జాయ్ రైడ్ చేసేందుకు కౌంటర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. సమయం లేదని పనుల్లో వేగం పెంచాలని సూచించారు.సరస్వతి పుష్కరాలకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పుష్కరాలను అత్యంత ఘనంగా నిర్వహించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని



తెలిపారు..పుష్కరాల సందర్భంగా వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రత్యేక ఘాట్లు, తాత్కాలిక వసతి కేంద్రాలు, ఆరోగ్య శిబిరాలు, తాగునీటి ఏర్పాట్లు, పరిశుభ్రత చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. ఈ పుష్కరాలలో ప్రత్యేకంగా ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు స్టేజి ఏర్పాట్లు, విద్యుద్దీకరణ చేయాలని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ప్రవచన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, దేవాదాయ శాఖల అధికారులు సంయుక్తంగా పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి విద్యుద్దీకరణ చేయాలని సూచించారు. విధులు నిర్వహించే సిబ్బందికి నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, పార్కింగ్, ఆర్టీసీ ప్రదేశాల్లో సురక్షిత మంచినీరు సరఫరా చేయాలని తెలిపారు. భక్తులు నదిలోకి వెళ్ళడానికి అనువుగా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.

ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, విద్యుత్ శాఖ ఎస్ ఈ మల్చూర్ నాయక్, దేవాదాయ శాఖ ఎస్ ఈ కనక దుర్గా ప్రసాద్, డిపిఓ నారాయణ రావు, పరిశ్రమల శాఖ జిఎం సిద్దార్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధు సూదన్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఆర్ డబ్ల్యూఎస్ ఈఈలు తిరుపతి రావు, వెంకటేశ్వర్లు, నళిని, ఆబ్కారీ ఈఎస్ శ్రీనివాస్, కాటారం డీఎస్పీ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తొలగించబడిన ఆర్టీసీ ఉద్యోగుల పట్ల
# ప్రభుత్వ చిత్తశుద్ధి హర్షణీయం

**హైదరాబాద్ పెన్ పవర్:** గత ప్రభుత్వంలో చిన్న చిన్న కారణాలతో అన్యాయంగా తొలగించబడిన 500 పైచీలుకు ఆర్టీసీ ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించి అంచలవారీగా తిరిగి ఉద్యోగాలలో తీసుకుంటామని ప్రకటించి ఇప్పటికే 130 మందిని ఉద్యోగాలలో తీసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం అని తొలగించబడిన ఆర్టీసీ ఉద్యోగులు దాసరి రాంబాబు, వీరాంజనేయులు,శ్రీనివాస గౌడ్ లు తెలియజేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ప్రజా భవన్ ఇంచార్జ్ చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య, ఆర్టీసీ ఎండి సజ్జన్నార్ లు తొలగించబడిన ఆర్టీసీ కార్మికుల గోడు విని తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించడం సంతోషకరమైన విషయమని అన్నారు. కొంతమంది పనిగట్టుకొని ప్రభుత్వంపై,సజ్జనార్ పై తమ ఆర్టీసీ కార్మికులను రెచ్చగొట్టి చేసిన వ్యాఖ్యలను పరిగణలోకి తీసుకోవద్దు అని విజ్ఞప్తి చేశారు. అలాగే వెంటనే తొలగించబడిన ఆర్టీసీ కార్మికులు. కాంట్రాక్ట్ ఉద్యోగులను విధులలోకి తీసుకొని పొట్ట చేత పట్టుకొని రోడ్లమీద ఉన్న తమ కుటుంబాలను నిలబెట్టాలని కోరారు.

## జీహెచ్ఎంసి కార్పొరేటర్లు ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం వద్ద మృతుల కుటుంబాలకు సంతాపం...

హైదరాబాద్ పెన్ పవర్:జమ్మూ కాశ్మీర్ లోని పహల్ గామ్ లో ఏప్రిల్ 22న పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీ జీహెచ్ఎంసి కార్పొరేటర్లు అసెంబ్లీ ముందు ఉన్న అమరవీరుల స్థూపం వద్ద మృతుల కుటుంబాలకు నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా జీహెచ్ఎంసి కార్పొరేటర్లు మాట్లాడుతూ... పాకిస్తాన్ దేశ ద్రోహులను తక్షణమే మట్టి కరిపించాలని హెచ్చరించారు. ఇప్పటికైనా దేశ ప్రధాని ఉగ్రవాదులను హతం చేసి దేశాన్ని రక్షించాలని కోరారు. పెహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడులను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ఉండేలా భారత ప్రభుత్వం ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కుల మతాలకు అతీతంగా దేశ ప్రజలు ఏకమై తీవ్రవాదాన్ని అంత మొందించేందుకు దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉగ్రవాద దాడుల్లో మరణించిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసి కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిపై ఒరిగిపోయిన లారీ

హైదరాబాద్ పెన్ పవర్: ఉండవల్లి బస్ స్టాండ్ వద్ద లారీ ప్రమాదం జరిగిందిక ఒక ఇంటి మీదకు లారీ ఒరిగిపోయింది. కంకర లోడు తో వెళ్తున్న లారీ, అతివేగమే ప్రమాదానికి గల కారణమని స్థానికులు వాపోతున్నారు. రాజధానికి ప్రధాన రహదారి కావడం తో ట్రాఫిక్ సమస్య అధికం అయింది అని స్థానికులు అంటున్నారు. రోడ్డు విస్తరణ చేస్తే కానీ ఈ సమస్య తీరాదు అని అంటున్నారు.

## తక్షణమే వారంతా పల్నాడును వదిలిపోవాలి

హైదరాబాద్ పెన్ పవర్: పాకిస్థాన్ పౌరులు ఎవరైనా పల్నాడు జిల్లాలో ఉంటే తక్షణమే వెళ్లిపోవాలని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. పాకిస్థాన్ వీసాలతో ఉండేందుకు వీలు లేదన్నారు. అక్రమంగా నివసిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా అటువంటి వారికి ఆతిథ్యం ఇచ్చే వారిపైనా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు.

## ఆళ్లగడ్డ ఆర్టీసి డిపోలో మంగళవారం డయల్ యువర్

హైదరాబాద్ పెన్ పవర్: డి.ఎం కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మొబైల్ ఫోన్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. ఉయ్యాలవాడ మండలం చిన్న ఎమ్మనూరు గ్రామం నుండి నొస్సం మీదుగా జమ్మలమడుగు కు గతంలో ఆళ్లగడ్డ డిపో నుండి నడుపుతు తొలగించిన ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్దరించాలని ఒక ప్రయాణికుడు అధికారుల దృష్టికి తీసుకొని రాగా ఉన్నతాధికారులకు నివేదిక పంపి చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ అధికారులు హామీ ఇచ్చారు.

# కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్ లో ఉద్యోగుల రాకపోకలపై ఆంక్షలు ఎత్తివేయాలి

హైదరాబాద్ పెన్ పవర్:సింగరేణి కార్మికుల గుండెకాయ ఉద్యోగులకు దేవాలయం లాంటి హెడ్ ఆఫీస్ లో కార్మికుల రాకపోకలపై ఆంక్షలు ఎత్తివేయాలని కోరుతూ మణుగూరు కు చెందిన సామాజిక సేవకులు కర్నే బాబురావు మంగళవారం నాడు కొత్తగూడెం హెడ్ ఆఫీస్ లో డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ మరియు ఇన్చార్జి డైరెక్టర్ పా కొప్పుల వెంకటేశ్వర్లు కి ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేసినట్లు కర్నే బాబురావు విలేకరులకు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులకు దేవాలయాలు ముస్లింలకు మసీదులు క్రైస్తవులకు చర్చిలు, సిక్కులకు స్వర్ణ దేవాలయం ఎంతనో సింగరేణి ఉద్యోగులకు వారి హృదయాలలో కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్ కు అంతటి గొప్ప స్థానం అంతటి భక్తి భావం ఉన్నదనీ. తమ కష్టాలు చెప్పుకోవడం కోసం ఆలయానికి మందిరాలకు భక్తులు ఎలా వెళతారో తమ సమస్యలు చెప్పుకోవడం కోసం కూడా హెడ్ ఆఫీస్ కి ఉద్యోగులు అలా వస్తారు. కానీ కొత్తగూడెం హెడ్ ఆఫీస్ లో ఉద్యోగుల రాకపోకలపై సెక్యూరిటీ విభాగం అమలు చేస్తున్న ఆంక్షలు కార్మికుల ఉద్యోగుల ఆగ్రహానికి, ఆవేదనకు కారణభూతం అవుతున్నాయన్నారు. మాజీ కార్మికులను కార్మిక నాయకులను అయితే మరి చిన్న చూపు చూస్తున్న పరిస్థితి వారు ఏదైనా వినతి పత్రం అందజేయాలని హెడ్ ఆఫీస్ కు వస్తే వారి పట్ల సెక్యూరిటీ విభాగం వారు అనుచితంగా ప్రవర్తించడమే కాక ఆంక్షల పేరుపై వారితోపాటు ఒక కెమెరా సెల్ తో సెక్యూరిటీ గార్డును వెంట పంపడం చివరికి బాత్రూంకి వెళ్లాం అన్నా తప్పని ఇబ్బంది పురాణాలలో హరిశ్చంద్రుని వెనుక నక్షత్రకుడి పాత్రను గుర్తు చేస్తున్నారనీ ఆయన ఆవేదన చేశారు. దళితులకు ఆలయాలలో ప్రవేశం ఉండదని కొన్ని రాష్ట్రాలలో కొన్ని సందర్భాలలో వార్తలు వింటూ ఉంటాం కచ్చితంగా అలాంటి సంఘటనలే హెడ్ ఆఫీస్ లో కార్మిక నాయకులకు సింగరేణి ఉద్యోగులకు ఎదురవుతోందనీ ఆయన వాపోయారు. కాంట్రాక్టర్లు కావచ్చు పైరవి కారులు కావచ్చు కార్లలో వస్తే వారికి ఎలాంటి ఆంక్షలు ఉండవని పైగా వారికి సలాం కొట్టి మరీ లోనికి సాగనంపుతారు కాలినడకన లేదా ద్విచక్ర వాహనంపై వస్తే వారి పట్ల చిన్నచూపు కొంతమంది సెక్యూరిటీ అధికారులు గార్డులు కూడా అతిగా ప్రవర్తిస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయని ఇలాంటి సంఘటనలు కార్మికుల్లో సంస్థ పట్ల వ్యతిరేకతను మూటగట్టుకుంటుందన్నారు ఇది సంస్థకు శ్రేయస్కరం కూడా కాదు ప్రత్యేక తెలంగాణ రాకముందు ఈ పరిస్థితి లేదనీ బలరాం ఎండి అయిన తర్వాత పరిస్థితిలో మార్పు వస్తుందని ఉద్యోగులందరు భావించారనీ, హైదరాబాద్ ప్రజాభవన్ లో మార్పులాగా సింగరేణి భవన్, హెడ్ ఆఫీస్ లో

కూడా కొంత మార్పు కనిపించిన మాట వాస్తవం ఎందుకో కానీ అంతే వేగంగా మరలా నిబంధనలు ఆంక్షలు మరింత కఠిన తరం చేస్తున్నారన్నారు చివరికి హైదరాబాద్ కార్పొరేట్ కార్యాలయంలో కూడా అచ్చు ఇలాంటి పరిస్థితి ఉద్యోగులకు ఎదురవుతున్నదనీ, దయచేసి సింగరేణి ఉత్పత్తి ఉత్పాదకతలలో శ్రమజీవులు చీకటి సూర్యులు సింగరేణి ఉద్యోగుల ఆత్మ తల్లి లాంటి సింగరేణి కంపెనీ ఉద్యోగులు సంస్థ కోసం అహర్నిశలు కష్టించి పనిచేస్తున్న ఉద్యోగులు తమ కష్టాలు చెప్పుకునేందుకు హెడ్ ఆఫీస్ రాకపోకలపై ఆంక్షలు సడలించాలని వారికి తగు గౌరవం ఇవ్వాలని అతిగా ప్రవర్తిస్తున్న సెక్యూరిటీ విభాగం అధికారులపై కావచ్చు గార్డులపై కావచ్చు మర్యాద నడుచుకోవాలని వారికి తగు ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నాం నిబంధనలు ఉండకూడదని కాదు అతి మాత్రం అతినే అది ఆయన తమ ఆవేదన వెలిబుచ్చినట్లు తెలిపారు అదేవిధంగా జి.ఎం పర్సనల ఐ ఆర్ అండ్ పిఎం కవితా నాయుడు మేడం కూడా కార్మిక సంఘాల నాయకులు వినతి పత్రాలు అందజేస్తే ఫోటో దిగేటందుకు నిరాకరిస్తున్నారనీ. అంతేకాదు సీనియర్ నాయకులు ఎవరన్నా మేడంని కలుద్దామని వస్తే మర్యాద కోసం అన్నా కనీసం కూర్చోమని కూడా అనరు ఈ అంశం పట్ల కూడా కార్మిక సంఘాలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోందన్నారు. ఆమె సింగరేణి అధికార ప్రతినిధి అని అన్యధా భావించక వారు కూడా ఈ అంశాన్ని కూడా గమనించాలనీ సమస్య పరిష్కారం అయినా కాకున్నా పెద్దపెద్ద నాయకులే వినతి పత్రాలు తీసుకుని ఫోటో దిగుతారు చివరికి ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న గౌరవ రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి సింగరేణి మంత్రి గౌరవ బట్టి విక్రమార్క , రెవెన్యూ మంత్రి గౌరవ శ్రీనివాస్ రెడ్డి మరియు ఎండి బలరాం కూడా ఎదుటివారు చెప్పేది విని వారు ఎంత చిన్నవారైనా నవ్వుతూ ఫోటో దిగుతారు కొత్తగా పదవి బాధ్యత చేపట్టిన డైరెక్టర్ గా మీతో ఫోటో దిగిన వారు ఎంతగానో సంతోషపడతారు చాలాచోట్ల వారి గురించి వారి మంచితనం గురించి వినటమే కాదు ప్రత్యక్షంగా చూశాం మేడంతో పాటు

చాలాచోట్ల వారి గురించి వారి మంచితనం గురించి వినటమే కాదు ప్రత్యక్షంగా చూశాం మేడంతో పాటు ఇతర అధికారులు కూడా వినతి పత్రాలు అందజేసే సమయంలో అందుకోవటంతో పాటు ఫోటో కూడా దిగే విధంగా తగు ఆదేశాలు జారీ చేయాలని వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నాను ఫోటో దిగితే పోయేదేమీ లేదు ఎదుటి వారికి ఎంతో సంతృప్తిస్తుందనీ సంస్థ శ్రేయోభిలాషిగా నా విజ్ఞప్తి పరిశీలిస్తారని కూడా ఆకాంక్షిస్తున్నాననీ ఆ లేఖలో బాబు అభిప్రాయపడ్డారు. పరిస్థితిలో మార్పు రాకపోతే హైదరాబాద్ ఎండి ని కూడా కలిసి హెడ్ ఆఫీస్ ఆంక్షలు పై వారి దృష్టికి తీసుకువెళతానని కర్నే బాబురావు విలేకరులకు తెలిపారు.

# జిల్లాలో జాతీయ రహదారుల భూసేకరణ, రైల్వే నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

హైదరాబాద్ పెన్ పవర్: జిల్లాలో జాతీయ రహదారులకు మరియు రైల్వే లైన్ కు సంబంధించిన భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు.
మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నందు జాతీయ రహదారి భూసేకరణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో కలిసి వర్చువల్ విధానంలో నేషనల్ హైవే పిడి లు, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓ లు రామ్మోహన్, కిరణ్మయి, భాను ప్రకాష్ రెడ్డి సంబంధిత మండలాల తాసిల్దార్లు తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారులు నిర్మాణాలకు ఎంతో ప్రాధాన్యతను



ఇస్తుందని అన్నారు. జిల్లాలో నిర్మితమవుతున్న పలు ప్రాజెక్టులు, జాతీయ రహదారుల సేకరణకు సంబంధించి పనులను ప్రాధాన్యత తీసుకొని వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. దీనికి సంబంధించి రెవెన్యూ డివిజన్ అధికారులు, తాసిల్దారులు, జాతీయ రహదారుల అధికారులతో సమన్వయం చేసుకొని పని చేయాలన్నారు. జాతీయ రహదారి భూసేకరణ పనులు త్వరిత గతిన పూర్తికావడానికి ప్రణాళికను రూపొందించుకొని పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారుల నిర్మాణ పనులు పురోగతి ఉన్న రహదారి విస్తరణ పనులు కూడా వేగంగా చర్యలు తీసుకోవాలని భూ సేకరణకు సంబంధించిన పెండింగ్ పనులలో సంబంధిత ఆర్డీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే గ్రామాలదగ్గర వచ్చే సర్వీస్ రోడ్డు లకు సూచిక బోర్డులను గ్రామ ప్రజలకు తెలిసేలా ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అధికారులకు సూచించారు

# ఘనంగా జరిగిన టీసిఇఐ - స్త్రీ శక్తి అవార్డ్స్ 2025 ప్రధానోత్సవం

**హైదరాబాద్ పెన్ పవర్:**మహిళలు తలచుకుంటే అసాధ్యాలు కూడా సులభ సాధ్యాలవుతాయని, అందుకు ఎందరో మహిళల విజయాలు మన కళ్ల ముందే నిదర్శనంగా నిలుస్తున్నాయని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మహిళా%-% శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ చాంబర్ ఆఫ్ ఇవెంట్స్ ఇండస్ట్రీ (టీసిఇఐ) ఆధ్వర్యంలో జరిగిన ప్రతిష్టాత్మక 7 ఎడిషన్ స్త్రీ శక్తి అవార్డ్స్ 2025 కార్యక్రమం మాధాపూర్‌లోని హెచ్ఐసిసిలో ఘనంగా నిర్వహించారు.



ముఖ్య అతిథిగా హాజరైన సీతక్క స్త్రీ శక్తి అవార్డుల ప్రధానోత్సవాన్ని ప్రారంభించారు. స్త్రీ శక్తి అవార్డులకు ఎంపికైన వారికి అవార్డులను బహుకరిస్తూ మంత్రి సత్కారం చేశారు. మహిళ సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, ముఖ్యంగా 'ఇందిరా మహిళ శక్తి పథకం' వంటి వాటి గురించి ప్రస్తావించారు. ప్రత్యేక ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక సృజనాత్మక పరిశ్రమలు శాఖ ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ స్త్రీ శక్తి అవార్డ్స్ వంటి కార్యక్రమాలు మహిళలు ఉన్నత స్థానాల్లోకి రావడానికి దోహదపడతాయని చెప్పారు. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) సీఈఓ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ, గ్రామీణ మహిళా ఉద్దీపనకర్తల గుర్తింపులో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందని అన్నారు. టీసీఇఐతో కలిసి సెర్ప్ ఆధ్వర్యంలో మహిళలకు ఈవెంట్ మేనేజర్లుగా శిక్షణ ఇవ్వడం ప్రారంభించినట్లు చెప్పారు. టీసీఇఐ అధ్యక్షుడు బలరాం బాబు, స్త్రీ శక్తి అవార్డ్స్ కన్వీనర్ మిల్లెట్ బ్యాంక్ వ్యవస్థాపకురాలు విశాలరెడ్డి మాట్లాడుతూ, స్త్రీ శక్తి వేదిక మరింత విస్తరిస్తోందని, భవిష్యత్‌లో మహిళల పాత్రను మరింత విస్తృత పరిచేలా సృజనాత్మక ఆర్థిక వ్యవస్థపై ప్రత్యేక కాన్ఫరెర్షి్ ఏర్పాటు చేశామని వివరించారు.

# నిరుపేద కుటుంబానికి న్యాయవాధులు చేయూత

**హైదరాబాద్ పెన్ పవర్:** :చిన్న తనంలోనే కంటిచూపు మందగించి ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న బాలికకు యువ న్యాయవాధులు అండగా నిలిచి భరోసా కల్పించారు. చిన్నతనంలో తండ్రి రవిని కూడా కోల్పోగా ఆ కుంటుంబం పరిస్థితి దయనియంగా మారింది. వివరాల్లోకి వెళ్ళితే జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం మద్దునూరు గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన గజ్జెల గంగజల (18) చిన్నతనం నుండే షుగర్ వ్యాధి ఉండడం మూలంగా కంటి చూపును కూడా కోల్పోయింది. అయితే ఆ కుటుంబాన్ని పేదరికం వెంటాడుతోంది.
పెద్ద ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయిస్తే కంటి చూపు వచ్చే అవకాశం ఉందని డాక్టర్లు చెప్పినప్పటికి డబ్బులు లేక ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితి నేలకోనడం కూతురు పరిస్థితి చూసి తల్లి భాధపడడం తప్పా చేసేదేమి లేకుండపోతోంది. దీంతో వీరు ఇంటివద్దనే ఉంటోంది.
ఆపరేషన్ చెయించే ఆర్థిక స్థోమత వారికి లేకపోవడంతో ఇంటి వద్దే ఉంటున్న ఆమే పరిస్థితిని తెలుసుకున్న మద్దునూర్ కు చెందిన యువ న్యాయవాది గజ్జెల రాజు ఇట్టి విషయాన్ని జగిత్యాల బార్ అసోసియేషన్, తన తోటి న్యాయవాదుల దృష్టికీ తీసుకెళ్లడంతో వెంటనే వారు స్పందించి గంగ జల కు కొంత ఆర్థిక సహాయం అందించారు.
ఆపదలో ఉన్న పేదవారికి ఎంతో కొంత తోచిన విధంగా సహాయం చేయడం సామాజిక భాద్యతని న్యాయవాదులు తెలిపారు.
తమ కూతురు వైద్యం కోరకు ఆర్థిక సహాయం చేసిన న్యాయవాదులకు గంగాజలా తల్లి సుశీల కృతజ్ఞతలు తెలిపింది.

# ఉమ్మడి కల్వచర్లలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం

**హైదరాబాద్ పెన్ పవర్:** రామగిరి మండలం కలవచర్ల గ్రామంలో జై బాపు జై భీమ్ జై సంహిదాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఐటీ శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, యువ నాయకులు దుద్దిళ్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు జై బాపు-జై భీమ్-జై సంవిధాన్ కార్యక్రమం రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో భాగంగా కల్వచర్ల మెయిన్ రోడ్డు నుండి కురుమపల్లె మీదుగా లొంకకేసారం వరకు కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు.
ఇంటింటికి వెళ్లి స్వాతంత్ర పోరాటంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు, స్వాతంత్రం వచ్చిన తరువాత దేశంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ఏ విధంగా రాజ్యాంగాన్ని అవమానిస్తూ కించపరుస్తూ వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేస్తూ, అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. మహాత్మా గాంధీ, డా.బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రి ఫూలే వంటి మహానుభావుల చరిత్ర, వారి ఆశయాలు, సిద్ధాంతాలు వారు సాధించిన విజయాలను గుర్తు చేశారు. ఉమ్మడి కల్వచర్ల కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు కొలిపాక సారయ్య, వీరగోని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రామగిరి మండల ముఖ్య కాంగ్రెస్ నాయకులు కలిసికట్టుగా భాగస్వామ్యమై పాల్గొన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ప్రతిజ్ఞ చేశారు. మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రొడ్డ బాపన్న, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తోట చంద్రయ్య, ఉమ్మడి కమాన్ పూర్ మండలం మాజీ జడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీపీలు ఆరెల్లి దేవక్క కొమరయ్య, కొరుకొప్పుల నీరజా తులసీరామ్ గౌడ్, రామగిరి మండల ఓబిసి అధ్యక్షులు బండారు సదానందం, కిసాన్ సెల్ అధ్యక్షుడు ముచ్చకుర్తి
శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు కొప్పుల గణపతి, కొట్టే సందీప్, మాజీ సర్పంచులు దేవ రామస్వామి, కాటం సత్యం, మాజీ ఉపసర్పంచ్ వేము కనకయ్య, నాయకులు పెద్ది సమ్మయ్య, మట్ట రాజ్ కుమార్, పుల్లెల కొమరయ్యలతోపాటు ఉమ్మడి కల్వచర్ల కాంగ్రెస్ నాయకులు వేముల వెంకటేశ్వర్లు, నాంసాని సందీప్ యాదవ్, చొప్పరి రాజయ్య, రొడ్డ భద్రయ్య, రొడ్డ సంపత్, రేండ్ల కృష్ణమూర్తి, ఆసం రాజు, మేకల మారుతి, బోయిన కొమురయ్య, రాజయ్య, బూడిద రాజేందర్, ఇరుగురాల రమేష్, కొట్టె నాగరాజు, బండి సంపత్, టి. కే.స్వామి, గొట్టెముక్కుల మల్లేష్, దాసరి మనోజ్, ఆర్ల శ్రావణ్, పడాల ప్రసాద్, సూరం లక్ష్మీనారాయణ, గెల్లు పర్వతాలు, మిట్టపల్లి మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన వైవిధ్యభరిత డిజైన్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** సర్వకాల సర్వావస్థ ల్లోనూ ధరించేందుకు, ఫ్యాషన్కు చిరునా మాగా కనిపించేందుకు వీలైన వైవిధ్యభరిత డిజైన్లను రూపుదిద్దిన యువ డిజైనర్ల సృజనాత్మక ప్రతిభ వేదికపై మెరుపులు మెరిపించింది. నగరానికి చెందిన వాక్సెన్ యూనివర్సిటీ మాదాపూర్ లోని టీ వర్క్స్ లో నిర్వహించిన 'డిజైన్ వాంగార్డ్-2025' కార్యక్రమం, ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ ఈవెంట్లో విద్యార్థులు తమ క్రియేటివ్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు సమర్పించిన వైవిధ్యభరిత ఫ్యాషన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సస్టెయినబులిటీ, వేరబుల్ ఇన్నోవేషన్ తదితర కాన్సెప్ట్ తో రూపొందించిన డిజైన్లు అహూ తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలోని 3 డీ ప్రింటెడ్ దుస్తులు, స్మార్ట్ వర్క్ వేర్, సస్టెయినబుల్ ఆర్కిటెక్చర్, మొబిలిటీ సొల్యూషన్స్, ఇంటరాక్టివ్ వీ ఆర్ గేమ్స్.. విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సత్తా చాటారు. తమ విద్యార్థుల ప్రతి భను ప్రపంచానికి పరిచయం చేసేందుకే ఈ వేదిక ఏర్పాటు చేశామని 'వర్సిటీ' డీన్ డా. ఆదితి సక్సేనా తెలిపారు.

# కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామివారి ఆలయంలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**హైదరాబాద్ పెన్ పవర్:** చిత్తూరు జిల్లా గంగవరం (మం), కీలపట్లలోని శ్రీ కోనేటిరాయస్వామివారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మే 5 నుండి 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం 8 నుండి 10 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఇందులో భాగంగా గర్భాలయం, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ ఎం. గజేంద్ర, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీ కోనేటిరాయ స్వామివారి బ్రహ్మోత్సవాలకు మే 4న సాయంత్రం 5.30 నుండి రాత్రి 8.30 గంటలవరకు సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రాంభమవుతాయి.

# మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మృతి

**నివాళులార్పించిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి**

**హైదరాబాద్ పెన్ పవర్:**జగిత్యాల మార్కెట్ మాజీ చైర్మన్, తక్కళ్లపెల్లి మాజీ సర్పంచ్ దశరథ రెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తాజా మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తక్కళ్లపెల్లి వెళ్లి పార్థివా దేహాన్ని సందర్శించి నివాళులార్పించారు.
జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపెల్లి గ్రామంలో మాజీ మార్కెట్ కమిటీ చేర్మెన్ దశరథ రెడ్డి గుండెపోటుతో మరణించగా మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. జీవన్ రెడ్డి వెంట నాయకులు గాజంగి నందయ్య, ముస్కు దామోదర్ రెడ్డి, ధర రమేష్ బాబు, జున్ను రాజేందర్,చందా రాధాకిషన్, అంకతి గంగాధర్, గోంటి మొగిలి, గోళ్ల తిరుపతి, నారాయణ రెడ్డి, ప్రభాకర్,నర్సింహా రెడ్డి, గోపాల్ రెడ్డి, తదితరులున్నారు.

## మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**హైదరాబాద్ పెన్ పవర్:**మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు.ఒంగోలు సింగరాయకొండ మండలంలోని పాకల పల్లెపాలెంలో మత్స్యకార సేవలో కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి మంత్రి పాల్గొన్నారు. సింగరాయకొండ, టంగుటూరు మండలాల్లోని 1,556 మంది మత్స్యకారులకు వేట నిషేధ భృతిని కింద రూ.3కోట్ల 11లక్షల 20వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో భృతికింద 20 వేలు మత్స్యకారులకు అందజేశామని తెలిపారు.

## ఫ్లోరైడ్ పీడిత గ్రామాల్లో రక్షిత మంచినీటి సౌకర్యం

**హైదరాబాద్ పెన్ పవర్:**ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మెన్ లంకా దినకర్ ప్రకాశంజిల్లా ఒంగోలులో పర్యటించారు.త్రాగు నీరు, ఫ్లోరైడ్ సమస్య ఎర్రగుండ పాలెం ఏస్పిరేషన్ బ్లాక్ లో కేంద్ర పథకాల అమలు తీరు పైన జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.కేంద్ర ప్రాయోజిత పథకాలు ప్రాజెక్టులు అమలుపై సమీక్షించారు.ప్రకాశంజిల్లా లో ఒక వైపు త్రాగు, సాగు నీరు ఇబ్బందులుంటే, పశ్చిమ ప్రకాశం జిల్లాలో ఫ్లోరిడ్ తీవ్రత ఎక్కువగా ఉందని,జిల్లాలో 729 పంచాయితీలలోని 1,769 గ్రామాల్లో 1009 గ్రామాలు ఫ్లోరిడ్ సమస్యతో ఉన్నాయని,ప్రస్తుతం ఫ్లోరిడ్ సమస్యను ఎదుర్కోవడానికి మొత్తం 27 గ్రామాల్లో సురక్షిత త్రాగు నీటి సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు.సమస్యలను పరిష్కరించాలని,ప్రస్తుతం కనిగిరిలో ఒక డయాలిసిస్ సెంటర్ లో నెలకు 120 మందికి సేవలు అందిస్తున్నారని,ఇంకా ఎన్ని అవసరమో ప్రణాళిక సిద్ధం చెయాలని ఆదేశాలు జారీ చేశారు.

## కాంగ్రెస్ భేటీలో కుమ్ములాట

**హైదరాబాద్ పెన్ పవర్:**సిరిసిల్లలో కాంగ్రెస్ నాయకుల కుమ్ములాట బహిరంగం అయ్యాయి. సిరిసిల్ల టికెట్ ఓడిపోయిన వారికే ఇస్తున్నారంటూ కేకే మహేందర్ రెడ్డిని ఉద్దేశించి పీసీసీ మాజీ అధికార ప్రతినిధి చీటీ ఉమేష్ రావు మాట్లాడారు. దాంతో కేకే వర్గం స్టేజి మీదకు దూసుకు వచ్చింది. ఉమేష్ రావు సమావేశం నుండి వెళ్లిపోవాలంటూ కేకే మహేందర్ రెడ్డి అనుచరులు ఆందోళనకు దిగారు పోలీసులు జోక్యం చేసుకుని కాంగ్రెస్ కార్యకర్తలను సముదాయించి స్టేజి పైనుండి పంపివేసారు.

## హెూంగార్డ్ కుటుంబాన్ని చితకబాదిన ఎస్సై

**హైదరాబాద్ పెన్ పవర్:** చనిపోయిన హెూంగార్డు కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా చేసిన కుటుంబసభ్యులను పోలీసులు దారుణంగా కొట్టారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం గునుగల్‌లో ఇంటివద్ద డ్రైనేజ్ గొడవలో హెూంగార్డ్ వెంకటేశ్ మృతిచెందాడు. న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగానే. అక్కడికి వచ్చిన ఎస్సై కుటుంబసభ్యులను బండ బూతులు తిడుతూ, విచక్షణారహితంగా కొట్టాడు.

# హరిత విప్లవం, మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, రైతు రుణమాఫీ,అగ్రికల్చర్ ప్రైసెస్ కమిషన్....

**హైదరాబాద్ పెన్ పవర్:**

కేరళ రాష్ట్రం కోజీకోడ్ జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైతులు-కార్మికుల మహాసభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చీఫ్ గెస్ట్ గా హాజరై ప్రసంగించారు.



తెలంగాణ, కేరళ రాష్ట్రాలలో వ్యవసాయమే ఒక జీవన విధానం. అలాంటి వ్యవసాయ రంగం నేడు అకాల వర్షాలు, పెరిగిన పెట్టుబడులు, మార్కెట్ ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు, మారిన వాతావరణ ప్రభావం వంటి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటుందని అన్నారు.

భారతదేశ ఆర్థిక నిర్మాణంలో వ్యవసాయ రంగ భాగస్వామ్యం క్రమంగా తగ్గుతుంది. 2016లో 17.5% కాగా.. ప్రస్తుతం అది 14% గా నమోదు అయ్యింది.. అయినప్పటికీ సగం జనాభా వ్యవసాయ రంగం మీదనే ఆధారపడి వున్నారు.ఈ నేపథ్యంలో మనం చరిత్ర నుండి చాలా నేర్చుకోవాలి, స్వాతంత్రం అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వాలు వ్యవసాయ రంగ అభివృద్ధికి తీవ్రంగా కృషి చేశాయి. స్వర్గీయ ఇందిరాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి వంటి నేతల సారథ్యంలో హరిత విప్లవాన్ని సాకారం చేశారు.అధిక ఉత్పత్తి ఇచ్చే విత్తనాలు, మెరుగైన నీటిపారుదల వ్యవస్థ, ఎరువులు అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ చర్యల మూలంగా ధాన్యం ఉత్పత్తి 55 మిలియన్ టన్నుల నుంచి 1978- 79 నాటికి 131 మిలియన్ టన్నులకు పెరిగింది, ఈ పరిణామం కేవలం వ్యవసాయ వృద్ధికే కాదు, గ్రామీణ ఉపాధిని, ఆర్థిక శక్తిని బలోపేతం చేసింది .రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు కాంగ్రెస్ బాటలు వేసింది, 1965 లో లాల్ బహదూర్ శాస్త్రి అగ్రికల్చర్ ప్రైసెస్ కమిషన్(%ూ్రాజ%)ను స్థాపించారు. ఇందిరా, రాజీవ్ గాంధీల కాలంలో వ్యవసాయ ధరల కమిషన్ ను మరింత బలోపేతం చేశారు.రైతులు మన ఆహార భద్రత, సాంస్కృతిక వారసత్వానికి సంరక్షకులు.రైతులను స్వతంత్రులను చేసేందుకు రుణమాఫీ అవసరం అని..2008లో ప్రధాని మన్మోహన్ సింగ్ గారి నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం 71,000 కోట్ల రుణాలను మాఫీ చేసింది, దీని ద్వారా దేశంలో 3.68 కోట్ల మంది రైతులకు అప్పుల భారం నుండి ఉపశమనం కలిగింది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఆశీర్వాదంతోనే ఏర్పడింది. ఇప్పటివరకు 21 వేల కోట్ల రూపాయల రైతుల రుణాలు మాఫీ చేశాం, రైతు భరోసా పథకం ద్వారా ఎకరాకు 12,000 పెట్టుబడి మద్దతుగా అందిస్తున్నాం, రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా, సన్నధాన్యం సాగుచేసిన రైతులకు క్వింటాలుకు 500 బోనస్, 10,547 కోట్ల విలువైన పంటల సేకరణ వంటి చర్యలు... రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందని అన్నారు.

సమాజాన్ని నడిపించేది.. అసంఘటిత కార్మికులు, వ్యవసాయ కార్మికులే. తక్కువ వేతనాలు, రక్షణ లేని పరిస్థితులు వారి జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి.

స్వాతంత్ర సమరయోధుల కాలం నుంచి కాంగ్రెస్ కార్మికుల హక్కుల కోసం పోరాడింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 16,19, 23, 24, 39, 41, 42, 43, 43 ఏ, 54 కాంగ్రెస్ ప్రభుత్వాల ప్రేరణతోనే ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ప్రతి గ్రామస్తునికి 100 రోజుల ఉపాధి హామీని కల్పించింది. ప్రపంచంలోనే ఇది ప్రథమ నిబంధన, ఈ పథకం గ్రామీణుల వేతనాలు పెంచింది, వలసలను తగ్గించింది, వ్యవసాయ రంగానికి తోడ్పాటును అందించింది. తెలంగాణ రాష్ట్రంలో ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేసి ఉపాధిని, ఆదాయాన్ని స్థిరంగా అందిస్తున్నాం, అసంఘటిత రంగ కార్మికులకు డిజిటల్ నమోదు ద్వారా బీమా, పెన్షన్ వంటి పథకాలు అందిస్తున్నాం.ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా తెలంగాణ ప్రభుత్వం భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఏడాదికి 12,000 ఆర్థిక సహాయం అందిస్తున్నాం.

గిగ్ వర్కర్ల హక్కులను గుర్తించి, వారికి ఆరోగ్య బీమా, సామాజిక భద్రత కల్పించే విధానాలను తెలంగాణ ప్రభుత్వం రూపొందిస్తుందని అన్నారు.

ప్రతి రైతు అభివృద్ధి ప్రయాణంలో మనం భాగస్వామి కావాలి,ఏ కార్మికుడు ఒంటరిగా ఉండకూడదు, “కర్షకుడిని రక్షించండి- కార్మికుడిని కాపాడండి” అనే నినాదం ఈ సదస్సుకు ఒక కొత్త దిక్సూచి కావాలి.

కేరళ భూమి సాధారణమైనది కాదు త్యాగాలు, పోరాటాలతో పునీతం అయ్యింది. పున్నప్ర వయలార్ వంటి ప్రజా ఉద్యమాలు వ్యవసాయ కూలీల హక్కుల కోసం జరిగిన పోరాటాలు మరువలేనివని అన్నారు.

భారత జాతీయ కాంగ్రెస్ ఎప్పుడు రైతు, కార్మికుల వెంట నడిచింది. గాంధీజీ స్వరాజ్య పిలుపు నుంచి కేరళ భూ సంస్కరణల వరకు ఇది స్పష్టం అయ్యింది. గౌరవం అనేది ఒకరు ఇచ్చేది కాదు.. అది అందరికీ లభించాల్సిన హక్కుని అన్నారు.

## విద్యార్థులు కచ్చితమైన ప్రణాళికతో చదివితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చు

**హైదరాబాద్ పెన్ పవర్:** విద్యార్థులు క్రమశిక్షణతో, కచ్చితమైన ప్రణాళికతో చదివితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చనని జగిత్యాల సీఐ వేణు గోపాల్ అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలో

ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో “పోలీసు, డిఫెన్స్ పరీక్షల ఉచిత శిక్షణ” కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు “ఉచిత షూ” పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగిత్యాల సీఐ వేణు గోపాల్ హాజరై విద్యార్థులు దేశ రక్షణ రంగంలో ఉద్యోగాలు చేయుటకు ముందుకు వచ్చేలా చేసిన ఎర్త్ ఫౌండేషన్ కి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో, కచ్చితమైన ప్రణాళికతో చదివితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని, ఎర్త్ ఫౌండేషన్ యువతను బాధ్యతాయుతమైన స్థానంలో నిలవడానికి ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కార్యక్రమానికి అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎర్త్ ఫౌండేషన్ డైరెక్టర్ ముద్రబోయిన రాజు,సీనియర్ కో ఆర్డినేటర్ ఆంజనేయులు, స్పెక్ట్రం ఇన్స్టిట్యూట్ ఎండి నాగరాజు, ట్రైనర్ అనిల్, అబాకస్ నిపుణులు గంగాధర్,విద్యార్థులు పాల్గొన్నారు.